క్లుప్తంగా

సీఆర్ఆర్‌కు నివాళి

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డికి మాజీ మంత్రి, కాంగ్రెస్ రాష్ట్ర కోశాధికారి పి.సుదర్శన్ రెడ్డి నివాళులర్పించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఆర్ఆర్ నివాసానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, గంగాధర్, శ్రీహరిరావు ఉన్నారు.

టీ9 (30) టిక్కెట్ సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్: టీ9 (30) టిక్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రయాణికులకు గురువారం నుంచి బస్‌పాస్‌ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. టిక్కెట్ ధర రూ.50 ఉంటుందని, పల్లెవెలుగు బస్సుల్లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణించే వెసులుబాటు ఉంటుందన్నారు. రూ.50 చెల్లిస్తే 30కిలో మీటర్ల వరకు రాను, పోను ప్రయాణం చేయవచ్చన్నారు.

ఉట్నూర్‌లో భారీ వర్షం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలో బుధవారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురుస్తోంది. రహదారులు, డ్రైయినేజీలు జలమయమయ్యాయి.. ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో ప్రజలు ఇంటికే పరిమితయ్యారు. పనులు ముగించుకొని ఇంటికి వెళ్లడానికి మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు.

వేతనాలు అందజేత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న పేషెంట్ కేర్‌లకు దుర్గం ఏజెన్సీ చైర్మన్ దుర్గం శేఖర్ బుధవారం వేతనాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాకపోయినప్పటికీ పేషెంట్ కేర్‌లకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఆదేశాల మేరకు జూన్ నెలకు సంబంధించిన వేతనాలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు గండ్రత్ చైతన్య, దీపక్ రెడ్డి, మాధస్తూ మహేందర్, రాహుల్ జందడే, సూరజ్ కాంబ్లే పాల్గొన్నారు.

రోడ్లపైకి పశువులను వదిలితే చర్యలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రోడ్లపైకి పశువులను వదిలితే యజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై తిరిగే మూగజీవాలను బంగారుగూడలోని గోశాలకు తరలిస్తామని, అలాగే రూ.5 వేల జరిమానా విధిస్తామన్నారు.

వైద్య శిబిరం

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు గొడం చందన్, సూపర్‌వైజర్ దేవిదాస్, వినోద్, శంకర్, కాశీరాం, శ్రీదేవి, అర్చన, మంజుల పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

సిరికొండ: మండలంలోని కొండపూర్ చిక్‌మాన్ వాగుపై కొట్టుకుపోయిన వంతెనను జెడ్పీటీసీ కుంరం చంద్రకళ, బీజేపీ నాయకులు పరిశీలించారు. అనంతరం నారాయణపూర్ చెరువుకు గండి పడి గ్రామంలోనికి వరద నీరు చేరడంతో గ్రామస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గత కొన్నేళ్ల నుంచి ప్రజలు ఇబ్బంది పడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఓట్ల కోసమే గ్రామాల్లో తిరుగుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందుర్ అమృత్‌రావు, బీజేపి మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, కన్నాపూర్ సర్పంచ్ కుంరం రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలు, తీగలు ముట్టుకోవద్దన్నారు. చిన్న పిల్లలు విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలన్నారు. సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడకూడదని, రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దన్నారు.

ఆందోళన విరమణ

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో దివ్యాంగులకు ప్రత్యేక కాలనీని ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికీ పెన్షన్లు ఇవ్వాలనే డిమాండ్లతో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన విరమించారు. 61 రోజులుగా దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి నిమ్మరసమిచ్చి విరమింపజేశారు. అనంతరం ఎన్‌పీఆర్‌డీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ. ఇమ్రాన్, ఫైజల్‌ఖాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు.

తొమ్మిది మందితో ఏర్పడి..

- ఎంతో మందిని విద్యావంతులను తీర్చిదిద్దిన దేవాలయం
- నేడు న్యాక్ బృందం రాక
- ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల పరిశీలన
- మెరుగైన గ్రేడ్ కోసం ప్రయత్నం



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల



పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ అనిత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల న్యాక్ బృందం రాక కోసం సర్వం సిద్ధమైంది. గురువారం ముగ్గురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం గురు, శుక్రవారాల్లో కళాశాలను పరిశీలించనుంది. వసతులు, విద్యాబోధన, తదితర సౌకర్యాలను పరిశీలించి గ్రేడ్‌ను కేటాయించనున్నారు. గ్రేడ్ ఆధారంగా కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు కేటాయించనున్నారు. ఇందుకోసం గతేడాదిగా కళాశాల సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రంగు రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఎంతో మందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన కళాశాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. తొమ్మిది మంది విద్యార్థులతో ప్రారంభమై ప్రస్తుతం ఏడాదికి 800 మంది విద్యార్థులకు విద్యాబోధన అందిస్తోంది. కళాశాలలో చదివిన విద్యార్థులు వివిధ హోదాల్లో రాణిస్తున్నారు. ఈసారి మెరుగైన ర్యాంక్ కోసం కళాశాల యాజమాన్యం గంపెడాశలు పెట్టుకుంది.

తొమ్మిది మంది విద్యార్థులతో..

జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల 1985లో ఏర్పడింది. తొమ్మిది మంది విద్యార్థులతో కళాశాలను ప్రారంభించారు. అప్పట్లో ప్రభుత్వ బాలికల కళాశాలలో రెండు గదుల్లో తరగతులు బోధించేవారు. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలగా ఏర్పాటు చేసి కేవలం మహిళలకు మాత్రమే విద్యాబోధన జరిగేది. ఆతర్వాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో కళాశాలను ఏర్పాటు చేశారు. అంచెలంచెలుగా వివిధ కోర్సులు ఏర్పాటు చేసి మహిళలకు విద్యాబోధన చేపట్టారు. మొదట అల్లాబక్షి ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఇప్పటివరకు 20 మంది ప్రిన్సిపాళ్లు పనిచేశారు.

కార్పొరేట్‌కు ధీటుగా..

కార్పొరేట్ కళాశాలకు ధీటుగా విద్యాబోధన సాగుతోంది. కళాశాలలో 20 మంది లెక్చరర్లు పనిచేస్తున్నారు. కళాశాలలో 15 తరగతి గదులు, రెండు కంప్యూటర్ ల్యాబ్‌లు, వర్చువల్ తరగతి గది, మూడు డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, రీడింగ్ హాల్, తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్, బాలుర కోసం ఫిట్నెస్ జిమ్, కమ్యూనికేషన్ స్కిల్స్, బాలికల కోసం వసతిగృహం, క్రీడా పరికరాలు, క్రీడా మైదానం తదితర సౌకర్యాలు ఉన్నాయి. కళాశాలను 2008లో న్యాక్ బృందం పరిశీలించింది. సమయంలో సి గ్రేడ్ కేటాయించారు. 2016లో మరోసారి న్యాక్ బృందం పరిశీలించగా బి గ్రేడ్ దక్కింది. మూడోసారి ప్రస్తుతం న్యాక్ బృందం పరిశీలనకు వస్తుంది. ఏ గ్రేడ్ కోసం కళాశాల యాజమాన్యం సౌకర్యాలు కల్పించి సర్వం సిద్ధం చేసింది.

ఏ గ్రేడ్ వస్తుందని ఆశిస్తున్నాం



కళాశాలలో న్యాక్ బృందం రాక కోసం సర్వం సిద్ధం చేయడం జరిగింది. గతం కంటే మెరుగైన ర్యాంక్ వస్తుందని ఆశిస్తున్నాం. ఏ గ్రేడ్ వస్తే కళాశాలకు నిధులతో పాటు ఇతర సౌకర్యాలు సమకూరనున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం.

– జలగం అనిత, ప్రిన్సిపాల్

నాణ్యమైన విద్యాబోధన



మా కళాశాలలో లెక్చరర్లు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారు. మంచి ఫలితాలు సాధిస్తున్నాం. చదువుతో పాటు వివిధ కల్చరల్ ప్రోగ్రామ్స్, కంప్యూటర్, వివిధ శిక్షణ కల్పిస్తున్నారు. గత కలెక్టర్ నాకు బెస్ట్ అంబాసెటర్‌గా అవార్డు అందించారు. కళాశాల క్రమశిక్షణకు నిలయం.

– ముండే రుమతాయి, విద్యార్థి

ఘనంగా కార్గిల్ దివాస్



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



బేల: నివాళులర్పిస్తున్న నాయకులు

బేల: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో బుధవారం భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్ నిర్వహించారు. భరతమాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి, అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అమరవీరులకు జోహర్లు, భరతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు అగర్కార్ అకాష్, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు బెదుర్కర్ ప్రఫుల్, ఉప్పల నారాయణ, గేడాం ప్రవీణ్, బర్కాడే రాము పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని సమాక, అందునాయక్ తండా గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్లు గోతి ప్రకాష్, గోతి ప్రకాష్, అంతర్వేధి రంగరావ్‌లు కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందారు. బుధవారం వారి విగ్రహాలకు బీఎస్పీ నాయకులు నివాళులర్పించారు. సోయం రాందాస్ మాట్లాడుతూ.. మాతృభూమి విముక్తి కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరుల త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ, దళిత, గిరిజన సంఘాల నాయకులు పెందోర్ అంకుష్, శివాజీ వావల్కర్, సునీల్, కిరణ్, విజయ్, మెస్రం మురారీ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని సొనాల వివేకానంద పాఠశాలలో కార్గిల్ దివాస్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. శత్రుదేశాన్ని ఓడగొట్టి భారత్ విజయం సాధించిందని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు దివ్యాంగుడు

- మతిస్థిమితం కోల్పోయిన బిహార్‌వాసి
- సామాజిక మాధ్యమం ద్వారా గుర్తింపు



తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీఎస్పీ

ఉట్నూర్‌రూరల్: బిహార్ రాష్ట్రానికి చెందిన మానసిక దివ్యాంగుడైన మనీశ్‌కుమార్ రాయిని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు బుధవారం అప్పగించారు. కొన్ని సంవత్సరాల నుంచి ఇంద్రవెల్లి, దనోర ప్రాంతాల్లో రోడ్లపై పిచ్చివాడై తిరుగుతున్నాడు. ధనోర–బి గ్రామస్తులు ఈ విషయాన్ని నెలరోజుల క్రితం గుడిహత్నూర్ మండలం చింతగూడెం మానవ మానసిక మందిర్ బాటసారికుల ఆశ్రమం నిర్వాహకుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన వారు వెంటనే వారి ఆశ్రమానికి తీసుకువెళ్లి అపరిశుభ్రంగా ఉన్న అతడిని పరిశుభ్రంగా మార్చి నూతన వస్త్రాలు ధరించారు. అనంతరం మానసికంగా ఆరోగ్య వంతుడిని చేసి ''డాన్‌బై మనావ మందిర్ అనే యూట్యూబ్ ఛానల్''లో ఈ విషయాన్ని ప్రపంచానికి తెలియచేశారు. మనీశ్‌కుమార్ బంధువులు బిహారల్‌లో యూట్యూబ్ ఛానల్‌లో గుర్తించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, బిఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్‌లు ఇట్టి విషయాన్ని ఉట్నూర్ డీఎస్పీ డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా డీఎస్పీ సమక్షంలో మానసిక వికలాంగుడైన మనీశ్‌కుమార్‌ను తల్లి దండ్రులకు అప్పగించారు. డీఎస్పీ దుర్గం ట్రస్ట్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, అర్జునే సంతోశ్, ప్రకాశ్, అంత్, దినేశ్, బాబా , మాదాస్, మహేందర్, సలాఉద్దిన్ రఫీక్, రాహుల్ తదితరులున్నారు.

బెల్ట్‌షాపులను తొలగించాలి

ఇంద్రవెల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేసిన బెల్ట్‌షాప్‌లను పూర్తిగా తొలగించాలని మండలంలో దళిత, గిరిజన సంఘాల నాయకులు బుధవారం ఎమ్మెల్యే రేఖానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై దాడులు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. బెల్ట్‌షాపుల నిర్వహణపై ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆర్‌టీఐ దరఖాస్తు చేస్తే.. ఒక్క గ్రామంలో కూడా బెల్ట్‌షాప్ లేదని సమాధానం ఇచ్చారని తెలిపారు. ప్రతీగ్రామంలో బెల్ట్‌షాప్‌లు నిర్వహించడం ద్వారా దళిత, గిరిజన యువత మద్యానికి బానిస అవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ, తుడుందెబ్బ, దళిత, గిరిజన సంఘాల నాయకులు సోయం రాందాష్, కాంబ్లే అతిష్, జగ్నాక్ భారత్, పెందోర్ అంకుష్, పుర్క చిత్రు పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించాలి

ఆదిలాబాద్‌రూరల్: ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని మండల వైద్యాధికారి రాహుల్ అన్నారు. మండలంలోని మామిడిగూడ సబ్‌సెంటర్ పరిధిలోని సల్పాలగూడలో టేకం లక్ష్మణ్ అనే యువకుడు మంగళవారం మృతి చెందడంతో బుధవారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. లక్ష్మణ్ జ్వరంతో మృతి చెందలేదని, ఆయన మద్యానికి బానిస కావడంతో రక్తం వంతులు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ మర్సుకోల లక్ష్మీబాయి, ఆరోగ్య సహాయకులు పవర్ ప్రేమ్‌సింగ్, ఇందుబాయి, సర్పంచ్ ఆత్రం యాదవ్‌రావు, పంచాయతీ కార్యదర్శి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన రాకపోకలు



ప్రమాదకరంగా దాటుతున్న ప్రజలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సిరిచెల్మ ఫ్లై ఓవర్ వంతెన వద్ద తాత్కాలిక వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో ఐదు రోజుల నుంచి 20 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొట్టుకుపోయిన వంతెనపై నుంచి ప్రమాదకరంగా దాటుతున్నారు. మండల కేంద్రానికి వెళ్లాలంటే అదనంగా 14 కిలోమీటర్లు అదనంగా దూరం ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. వంతెన నుంచి జామిడి కేవలం కిలోమీటర్ దూరంలోనే ఉంటుంది కానీ ఆటోలో వెళ్లాలంటే ముఖరా(బి), ముఖరా(కె), జల్దా గ్రామాల నుంచి 14 కిలోమీటర్ల వెళ్లాలి. కొట్టుకపోయిన వంతెన వద్ద రాకపోకలు సాగించేందుకు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

ఇంద్రవెల్లి: గతకొద్ది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. బుధవారం మండలంలోని పిట్టబొంగరం గ్రామానికి చెందిన వెట్టి యేశ్‌ధాన్, కినక మాన్కుబాయి, నిర్మలతో పాటు సాలేగూడ గ్రామానికి చెందిన విజయలక్ష్మీ, మడావి లింగు, నిజంగూడ గ్రామానికి చెందిన రూపబాయిలు పిట్టబొంగరం ప్రభుత్వ ఆస్పత్రికి రావడంతో ఆస్పత్రి బెడ్స్ సరిపోక ఒక్క బెడ్‌లోనే ఇద్దరిని పడుకోబెట్టి వైద్యం అందిస్తున్నారు. వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో ఏఎన్ఎంలే వైద్యం అందించి రోగులను ఇంటికి పంపుతున్నారు. వైద్యాధికారి అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

'అసమర్థ ముఖ్యమంత్రి కేసీఆర్'

నార్నూర్: తెలంగాణలో పేదలకు ఒక డబుల్ బెడ్ రూం ఇవ్వలేని అసమర్థ ముఖ్యమంత్రి కేసీఆర్ అని పీసీసీ ప్రతినిధి బాలకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జీన్‌గూడ సమీపంలో డబుల్ బెడ్ రూం ఇళ్లను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను మాటలతో మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మర్సుకోల సరస్వతి, రాథోడ్ గణేశ్, సత్తార్, జాకురుల్లాఖాన్, యుసుఫ్‌ఖాన్, సయ్యద్ అజమ్, తదితరులు పాల్గొన్నారు.

కలిసిమెలిసి పండుగలు జరుపుకోవాలి

తాంసి: అన్నిమతాల ప్రజలు పండుగలను కలిసిమెలిసి జరుకోవాలని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. సవారీబంగాల్లో పూజలు నిర్వహించి, పీరీలను ఊరేగించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు రజనీకాంత్ రెడ్డి, కృష్ణ, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తిరుమల్‌గౌడ్, కల్యాణ్, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొహర్రం ఉత్సవాలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని భీంనగర్, బజర్‌గల్లితో పాటు మండలంలోని గోండ్‌గూడ, వడగామ్, వాల్గొండ, ముత్నూర్, కేస్లాపూర్, ధనోర, గౌరపూర్, టెడికిగూడ, చిత్తగూడ గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామాల్లో డోల, పీరీలను ఊరేగించారు. ఈనెల 28 వరకు మొహర్రం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనేతరులు

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని గిరిజనేతరుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజనేతరులు బుధవారం ఉట్నూర్‌లోని జెడ్పీచైర్మన్ నివాసంలో చైర్మన్ జనార్దన్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజనేతరులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు, రైతుబంధు ఇవ్వాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీచైర్మన్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజనేతరులు అబ్బాస్, వజీర్, హబీబ్‌ఖాన్, నవాబ్‌ఖాన్, అంకుశ్, శాహెద్, మునీరొద్దీన్, ఖయ్యూం, నవాజ్ పాల్గొన్నారు.

పోడుపట్టాలు ఇవ్వాలి..

సిరికొండ: మండలంలోని సాత్‌మోరి, లక్ష్మీపూర్, తుమ్మల్‌పాడ్, బోరింగ్‌గూడ గ్రామాల రైతులకు పోడుపట్టాలు ఇవ్వాలని బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బజ్‌పాయ్‌ను కలిశారు. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి, పట్టాలు, రైతుబంధు అమలు అయ్యేలా చూడాలన్నారు. త్వరలోనే పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామని పీవో హామీ ఇచ్చారు.

'బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. ముందుగా రైతువేదిక వద్ద లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మిలింద్‌నగర్, సట్వాజిగూడ గ్రామాలను సందర్శించి, దళితబంధు యూనిట్‌లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేసీఆర్ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటీ శోభాబాయి, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, శారద, విజయ, స్వర్ణలత, కోవ రాజేశ్వర్, పార్వతిబాయి, దేవ్‌పూజే మారుతి పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



సవారీబంగ్లా షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల సమయంలోనే వచ్చే ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని ఖానాపూర్, కేఆర్‌కే కాలనీ, కుమార్‌పేట్, రాంనగర్ కాలనీల్లో కొత్తగా నిర్మించిన సవారీబంగ్లా షెడ్డులను బుధవారం ప్రారంభించారు. కాలనీవాసులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం దేశానికే ఆదర్శవంతమైన పథకాలను అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలకు మాయమాటలు, చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నవీన్, చంద్రయ్య, ఆనంద్, అబుజర్, అయ్యాబ్ పాల్గొన్నారు.

ఘనంగా రిజర్వేషన్ సంబురాలు



బోథ్: నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో రిజర్వేషన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ సంస్కర్త, రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ ఇన్‌చార్జి రమేశ్ మాట్లాడుతూ.. వెనకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించిన మానవతావాది సాహు మహరాజ్ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మికాంత్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, మెస్రం మీనా, సంతోశ్, వెట్టి దేవిదాస్ పాల్గొన్నారు.

బోథ్: రిజర్వేషన్ల దినోత్సవాన్ని బహుజన్ సమాజ్ పార్టీ బోథ్ అసెంబ్లీ అధ్యక్షుడు చిలుముల పంచాక్షరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాహు మహరాజ్, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణలో కూడా బీసీలకు జనాభాకు అనుగుణంగా రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, మెస్రం జంగుబాపు, పాముల అనిల్, సొన్న హరీష్ లక్ష్మణ్, రాజశేఖర్, నవీన్, సాయికృష్ణ, రాజశేఖర్, విజయ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ నిందితులను శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బోథ్: మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సొనాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బత్తుల రమేశ్ మాట్లాడుతూ.. బీజేపీలో ప్రభుత్వంలో ఆదివాసీ ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసంఘం మండల అధ్యక్షుడు అమృత్ రావ్‌పాటిల్, మంగళపల్లి రాజశేఖర్, సోమన్న, కార్తీక్, మహేశ్ పాల్గొన్నారు.

బేల: మణిపూర్‌లో మహిళ హత్యను నిరసిస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కుమురం భీం చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి మేషక్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం

నేడురౌండ్ టేబుల్ సమావేశం

ఎదులాపురం: సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో గురువారం సేవ్ ఆర్టీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై చర్చ ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, మేధావులు, కార్మికులు, కర్షకులు పాల్గొనాలని కోరారు.

నేడు రైతులతో ప్రధాని ముఖాముఖి

బోథ్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్ తెలిపారు. మండల రైతులు బోథ్‌లోని రైతువేదికలో పాల్గొనాలని కోరారు.